ప్రజాశక్తి

శుక్రవారం 23 ఆగస్టు 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలకు రూ.కోటి, తీవ్ర గాయాలైన వారికి రూ.50 లక్షలు చొప్పున పరిహారం
- ఫార్మా ప్రమాద ఘటన ఎంతగానో కలిచివేసింది
- ఎసెన్షియా యాజమాన్య నిర్లక్ష్యంతోనే ప్రమాదం
- విశాఖ, అనకాపల్లి పర్యటనల్లో సిఎం చంద్రబాబు
- ఫార్మా ప్రమాద బాధితులకు పరామర్శ

మెడికవర్‌లో బాధితున్ని పరామర్శిస్తున్న చంద్రబాబు

కెజిహెచ్‌లో మృతుల కుటుంబీలతో చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి, ఎంవిపి.కాలనీ విలేకరి

'ఫార్మా సిటీలో జరిగిన ప్రమాదం నన్ను ఎంతగానో కలిచివేసింది. 17 మంది మృతి చెందం, 36 మంది గాయపడటం అత్యంత దురదృష్టకరం. ఘటనను తలచుకుంటే ఎంతో బాధేస్తోంది. గత వైసిపి ప్రభుత్వం వ్యవస్థలను సర్వనాశనం చేసింది. అటువంటి సమయంలో మా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇంతలోనే ఈ ఘటన జరిగిపోయింది. ఎవరూ అధైర్య పడకండి. అందరికీ అండగా ఉంటాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు అన్నారు. విశాఖ నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫార్మా సిటీ ప్రమాద క్షతగాత్రులను, కెజిహెచ్ మార్చురీ వద్ద ఉన్న మృతుల కుటుంబీకులను ఆయన గురువారం పరామర్శించారు. వారి గోడును విన్నారు. అనంతరం మాట్లాడుతూ ఎంత ఖర్చయినా భరించి ప్రభుత్వం అందరికీ సూపర్ స్పెషాలిటీ వైద్యం అందిస్తుందన్నారు. శరీరం 57 శాతం కాలిన దేవుడుకు ప్లాస్టిక్ సర్జరీ చేసి మునుపు ఎలా ఉన్నాడో అలా తయారు చేసేలా వైద్యం అందివ్వాలని వైద్యులను ఆదేశించారు. 17 మంది మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు, తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారికి రూ.50 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.25 లక్షలు చొప్పున పరిహారాన్ని కంపెనీ అందిస్తుందన్నారు. ఈ సంఘటన ఎలా జరిగింది ? ఎందుకు జరిగింది ? బాధ్యులెవరు ? అన్న అంశాలను, ఇంకా ఏమైనా లోపాలుంటే వాటన్నింటినీ ప్రభుత్వం అధ్యయనం చేస్తుందని తెలిపారు. భద్రతా చర్యల ప్రక్షాళనకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సేఫ్టీ ఆడిట్ జరగకపోవడమే ఈ ఘటనకు ప్రధాన కారణమని, అన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేస్తామని అన్నారు. ఇప్పుడు బాధితులకు ఇచ్చిన ఆర్థిక సాయం, పరిహారం తాత్కాలికమైనదేనని, శాశ్వతంగా ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఏం చేయాలో ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు. ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్య మిగతా 2లో..

నిలకడగా క్షతగాత్రుల ఆరోగ్యం

ఎసెన్షియా ఫార్మాలో బుధవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో గాయాలపాలై విశాఖపట్నంలోని పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న 14 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో ఉండగా, ఏడుగురు వెంకోజీపాలెం వద్ద ఉన్న మెడికవర్ హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్నారని తెలిపారు. అదేవిధంగా కూర్మన్నపాలెంలోని పవన్ సాయి హాస్పిటల్‌లో ముగ్గురు, గాజువాకలోని ఆర్‌కె హాస్పిటల్‌లో ఒకరు చికిత్స పొందుతున్నారని వెల్లడించారు.

వార్త 2లో..

కెజిహెచ్‌లో ఆందోళన చేపట్టిన సిహెచ్.నర్సింగరావు తదితరులు

బాధితుల పక్షాన సిఐటియు, సిపిఎం పోరాటం

24న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

వార్త 2లో..

హత్యాచార ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

వార్త 8లో..

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

వార్త 7లో..

నిరసన తెలుపుతున్న జెడి.శీలం, కాంగ్రెస్ నాయకులు

అదానీ కుంభకోణంపై
జెపిసితో సమగ్ర విచారణ జరపాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిండెన్ బర్గ్ రిపోర్ట్ ద్వారా బహిర్గతమైన అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జెపిసి)తో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సిడబ్ల్యుసి సభ్యులు, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ సహాయ మంత్రి జెడి.శీలం డిమాండ్ చేశారు. హిండెన్ బర్గ్ రిపోర్ట్ ద్వారా అదానీకి, సెబి చైర్మన్‌కుగల అక్రమ వ్యాపార సంబంధాలు బహిర్గతమయ్యాయని అన్నారు. అదానీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తూ విశాఖ నగరంలోని ఎంవిపి.కాలనీ ఇసుక తోట కూడలిలోగల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల కష్టార్జితాన్ని అదానీకి దోచిపెట్టడం మిగతా 2లో..

అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేపట్టిన ఉక్కు కార్మికులు

రోడ్డుపై బైఠాయించిన పోరాట కమిటీ నేతలు

స్టీల్ అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

కర్మాగారాన్ని పూర్తి సామర్థ్యంతో నడపాలని నినదించిన కార్మికవర్గం

వార్త మెయిన్‌లో..

మొదటి పేజీ తరువాయి..

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందన్నారు. చంద్రబాబు వెంట రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి, విశాఖ ఎంపీ శ్రీభరత్, భీమిలి ఎంఎల్ఎ గంటా శ్రీనివాసరావు తదితరులున్నారు.

అస్వస్థతకు గురైన చిన్నారులను పలకరించిన సిఎం

చిన్నారిని పలకరిస్తున్న చంద్రబాబు

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను చంద్రబాబునాయుడు పరామర్శించారు. చిన్న పిల్లల వార్డులోని ఒక్కో బెడ్ వద్దకూ వెళ్లి ప్రతి చిన్నారితో ఆప్యాయంగా మాట్లాడారు. మరేం భయం లేదని.. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

సిపిఐ వినతి

ఫార్మా ప్రమాదంలో మృతిచెందిన వారికి నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని కోరుతూ సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు సిఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.విమల, ఎస్.నాగభూషణం, కె.క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు పరామర్శ

ఫార్మా ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబీకులను విశాఖలోని కెజిహెచ్ మార్చురీ వద్ద వైసిపి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావు, మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించారు. కాంగ్రెస్ తరుపున మాజీ ఎంపీ కిల్లి కృపారాణి, భారత నాస్తిక సమాజం తరుపున వై.నూకరాజు, డి.విజ్ఞానంద్, సునీత తదితరులు పరామర్శించారు.

బాధితుల పక్షాన సిఐటియు, సిపిఎం పోరాటం

ఎసెన్షియా యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే రియాక్టర్ పేలి పెద్ద ప్రమాదం సంభవించి కార్మికులు మృత్యువాత పడ్డారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. చనిపోయిన ఒక్కో కుటుంబానికి తక్షణం రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కంపెనీ యాజమాన్యాన్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గురువారం కెజిహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబాలను సిఐటియు విశాఖ, అనకాపల్లి జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జి.కోటేశ్వరరావు, సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథంలతో కలసి ఆయన పరామర్శించారు. ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో పరిశ్రమల్లో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదం జరిగినప్పుడు చనిపోయిన 12 మంది కార్మికులకు రూ.కోటి చెప్పున పరిహారం ఇచ్చారని, తరువాత చనిపోయిన ముగ్గురికీ ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం చెల్లించలేదని తెలిపారు. అలా చేయడం ఎంత మాత్రమూ తగదన్నారు. ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీలు ఇచ్చిన సిఫార్సులను అమలు చేయకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మా సిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వివి.శ్రీనివాసరావు, శ్రామిక మహిళా కన్వీనర్ పి.మణి, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ప్రజా సంఘాల నాయకులు టి.నూకరాజు, ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్, జి.అప్పలరాజు, శివ, పి.వెంకటరావు, కుమారమంగళం, నాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. ఇంతమంది చావుకు కారణమైన యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందిస్తూ అందరి నుంచీ ఆ డిమాండ్ ఉందని, ప్రమాద కారకులు ఎక్కడా వున్నా పట్టుకొచ్చి వారు చేసిన తప్పుకు శిక్ష పడేలా చేస్తామని తెలిపారు. అనకాపల్లి కలెక్టర్, ఎస్‌పి ఘటనపై పర్యవేక్షణ చేస్తున్నారని వెల్లడించారు.

జెపిసితో సమగ్ర విచారణ జరపాలి

కోసం కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పనిచేయడం సిగ్గుచేటన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి బినామీగా అదానీ వ్యవహరిస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కాంగ్రెస్ నగర అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్ రామారావు, సెక్రటరీ ఎస్.సుధాకర్, పిసిసి నాయకులు పరమేశ్వర్, రాజా, ఈశ్వరి పాల్గొన్నారు.

24న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు శనివారం జరుగుతాయని జిల్లా పరిషత్ కార్యనిర్వాహణ అధికారి డి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకటి నుంచి ఏడు వరకూగల స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు 2, 5 స్థాయీ సంఘాల సమావేశాలు, 11 గంటలకు 4, 3 స్థాయీ సంఘాల సమావేశాలు, మధ్యాహ్నం 12 గంటలకు 6, 7, 1 స్థాయీ సంఘాల సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఎవరిని కదిపినా కన్నీరే..!

ఎసెన్షియా యాజమాన్య తీరుపై బాధిత కుటుంబాల నిరసన

మృతదేహాల కోసం కంపెనీ గేటు ముందు పడిగాపులు కాస్తున్న కుటుంబీకులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి విలేకరి

'మీ కోటి మాకెందుకు, మా తల (ఇంటి పెద్ద దిక్కు) మాకివ్వండి. ఇక్కడ నుంచి వెళ్లిపోతాం. మావి ప్రాణాలు కాదా, డ్యూటీకి ఎలా వచ్చారో అలాగే పంపండి' అని మృతుల బంధువులు రోదించారు. తమ తోబుట్టువులు, బంధువుల మృత దేహాల కోసం బుధవారం నుంచి గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఎసెన్షియా ఫార్మా కంపెనీ గేట్ వద్ద వారంతా నిరీక్షించారు. జరిగిన ఘటన గుర్తుచేసుకొని గుండెలవిసేలా ఏడుస్తున్నా వారిని పట్టించుకున్నవారు లేరు. భారీ వర్షం కురిసినా, తడుసుకుంటూ కంపెనీ ముఖద్వారం వద్దే వారు ఉన్నారు. వర్షం తగ్గాక ఆ ప్రదేశం నుంచి దూరంగా పంపించాలని పోలీసులు ప్రయత్నం చేశారు. సచ్చిపోయిన కుటుంబాలకు కోటి ఇస్తామన్నారు కదా, వెళ్లిపోండి, ఇంకెందుకు అని పోలీసులు వ్యంగ్యంగా మాట్లాడారు. తీవ్ర మనస్తాపం చెందిన బాధితులు 'మేము డబ్బుల కోసం ఇక్కడకు రాలేదు, మా వాళ్ల కోసం వచ్చాము. ఎలా ఉన్నారో, ఎక్కడ ఉన్నారో నిన్నటి నుంచి చెప్పలేదు. మాకు కోటి వద్దు, మా వాళ్లను మాతో ఇంటికి పంపిస్తే చాలు' అని అన్నారు. తుదకు చంద్రబాబు వచ్చే సమయం దగ్గర పడుతుందంటూ అక్కడ నుంచి నెమ్మదిగా పోలీసులు జారుకున్నారు.

కనీస సమాచారమూ ఇవ్వని వైనం

రాంబిల్లి మండలం, సెజ్ కాలనీకి చెందిన యల్లబిల్లి చిన్నారావు ఎసెన్షియా కంపెనీలో 8 ఏళ్లకు పైబడి పని చేస్తున్నాడు. అతనికి భార్య లోవమ్మ, పదేళ్ల కొడుకు శశాంక్, ఎనిమిదేళ్ల కుమార్తె కోయిలి వున్నారు. బుధవారం జనరల్ షిఫ్ట్‌కు వెళ్లిన తరువాత ప్రమాదం జరిగిన విషయం తెలుసుకొని వెళ్లి అడిగితే చిన్నారావు గురించి చెప్పలేదని ఆయన బాబాయ్ శంకరరావు తెలిపాడు. అన్ని ఆస్పత్రులు తిరిగితే ఎన్‌టిఆర్ ఆస్పత్రిలో ఉన్నారని తెలిసి వెళ్లాక, అక్కడ నుంచి సమాచారం లేకుండా కెజిహెచ్‌కు తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్నారావు చనిపోయిన విషయాన్ని తెలియజేయలేదన్నారు.

మా నాన్న ఎక్కడ...?

తండ్రి కోసం కూతురు పడిగాపులు

నా తండ్రి ఏమయ్యాడో ఇంతవరకు చెప్పలేదని మృతుడు వేగి సన్యాసినాయుడు కూతురు కొయిలాడ వసంత కుమారి తెలిపింది. రాంబిల్లి మండలం, మూలజంపకు చెందిన సన్యాసినాయుడు ఏడేళ్లగా హౌస్ కీపింగ్ సహాయకునిగా పనిచేస్తున్నాడు. 'మా నాన్నను గుర్తుపట్ట లేకపోతున్నాం. ఎక్కడ ఉన్నాడో తెలీడం లేదు. మృతి చెందిన విషయం చెప్పకపోవడంతో గేట్ దగ్గర ఉన్నాను' అని తెలిపింది.

బాబువి నమ్మశక్యం కాని మాటలు

గ్రేటర్ విశాఖ బ్యూరో : అచ్యుతాపురం ఎసెన్షియా కంపెనీ నిర్లక్ష్యం కారణంగా మరణించిన వారి కుటుంబ సభ్యులను, బాధితులను పరామర్శించడానికి గురువారం విశాఖకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన మాటలు నమ్మశక్యంగా లేవని న్యూ సోషలిస్ట్ ప్రాక్టీస్ (ఎన్‌ఎస్‌పి) సభ్యులు సుజన్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమాధిపతుల లాభాల కోసమే గతంలో చంద్రబాబు ప్రభుత్వం పనిచేసిందని పేర్కొన్నారు. ఫార్మా కంపెనీల్లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తూ ప్రభుత్వమే వ్యవస్థాగత హత్యలకు పాల్పడుతోందని, కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని అన్నారు.

సెజ్‌లో దారుణాలపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

గతం నుంచీ ఫార్మా కంపెనీలు, అచ్యుతాపురం సెజ్‌లో పనిచేసే కార్మికులకు భద్రత లేకుండా పోతోందని, తాజాగా ఎసెన్షియా ప్రమాదాన్ని చూస్తే సేఫ్టీ ఎక్కడా లేదని అర్థమవుతోందని ఫార్మసీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు కెవివిఎస్ పద్మావతి అన్నారు. గురువారం మెడికవర్ వద్ద సిఎం చంద్రబాబును కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమెకు బాబు భరోసా ఇస్తూ ఈ ఫిర్యాదులో ఉన్న విషయాలన్నిటిపైనా చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

ప్రేమ వివాహాన్ని అడ్డుకోవడం తగదు

విశాఖ కలెక్టరేట్ : మేజర్లై ఉండి, ఉన్నత విద్య చదువుకొని ఎనిమిది సంవత్సరాలుగా ప్రేమించుకుంటూ వివాహానికి సిద్ధమైన జంటను ఒకటి కాకుండా అడ్డుకోవాలని పెళ్లి కుమార్తె తండ్రి, రిజర్వ్ ఎస్ఐ అయిన అతని సోదరుడు ప్రయత్నించడం చట్ట విరుద్ధమని మహిళా చేతన కార్యదర్శి కత్తి పద్మ అన్నారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ప్రేమికులై వివాహానికి సిద్ధపడ్డ వినీత, వెంకటేష్‌లకు పద్మ వివాహం జరిపించి దండలు మార్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ

బిట్వీన్: **యఫ్.ఏ. నెం. 150/2024**

శ్రీ విజయ్ కుమార్ అగర్వాల్ ...అప్పిల్లెంట్

అండ్

ది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్

మరియు ఇతరులు **నోటీసు** ...రెస్పాండెంట్స్

టు,

రెస్పాండెంట్ నెం. 4:

M/s. **భారతి అసోసియేట్స్ అండ్ ఏజెన్సీస్,** రిప్రజెంటెడ్ బై ఇట్స్ ఇన్వెస్టిగేటర్ శ్రీ వి. సత్యనారాయణమూర్తి, డోర్ నెం. 22-71-30, చట్రాజు స్ట్రీట్, SKML టెంపుల్ దగ్గర, విశాఖపట్నం-530 001.

పై అప్పిల్లెంట్ శ్రీ విజయకుమార్ అగర్వాల్ గారు మహారాజశ్రీ డిస్ట్రిక్ట్ కమీషన్-II, విశాఖపట్నంలో C.C.109/2022 ఇచ్చినతీర్పుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడలో పైనెంబరు అప్పీలు F.A.150/2024 దాఖలు చేసియున్నారు. సదరు కేసు నందు 4వ రెస్పాండెంటు అయివున్నారు. సదరు అప్పీలులో మీరు నోటీసులు అందుకోకుండా తప్పించుకొనుచున్నందున మహారాజశ్రీ కమీషన్ వారు మీకు ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు జారీచేసియున్నారు. సదరు అప్పీలులో మీయొక్క హాజరు కొరకు **తేది.10-09-2024**న వాయిదా అయివున్నది. కావున మీరు పై తెలిపిన రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, అశోక్‌నగర్, విజయవాడ నందు **తేది.10-09-2024**న ఉ॥గం॥ **10.30ని॥**కు స్వయంగాగానీ లేదా మీతరుపు న్యాయవాది గారి ద్వారాగాని హాజరై మీయొక్క అభ్యంతరములు, ఆక్షేపణలు తెలియపర్చవలెను. లేనియెడల పైఅప్పీలు మీపరోక్ష మందు తీర్మానించెదరని మీకు తెలియజేయడమైనది.

(By Order of the Hon'bel Commission)

MANNE HARI BABU & K. KALPANA

Advocates Vijayawada. **Cell: 94404 82681**

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM

O.S.No. 541/2012

Between:

Smt. Kaitha Kamala (died) and Others ... Plaintiffs

And:

Sri Botta Kali Prasad Rao (died) and othes ... Defendents

NOTICE

To

5th Defendent

Botta Jaya Prakash,
S/o. Late Venkata Rao
D.No. 57-27-157,
Old ITI Junction
Siddharth Nagar
Visakhapatnam.

Please take notice that the above named Petitioner/ Plaintiff has instituted the above case against you and others.

The same stands posted to **9-9-2024** for your appearance, on that day at **10-30 A.M.** you should appear before the afore said Honourable Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte.

P.SUMATHI

M.S.S.V.N. PATRUDU

Advocates

Visakhapatnam

ఆర్డరు Vరూల్ 20 ప్రకారం జారీ చేసిన నోటీసు మహారాజశ్రీ గాజువాక సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.378/2021 I.A.No.1045/2021

వాది: అంగరాజు రామరాజు

ప్రతివాదులు: గద్దె అరుణకుమారి & ఇతరులు

టు:

D-1: గద్దె అరుణకుమారి, భర్త లేటు గద్దె వెంకటేశ్వరరావు, డో.నెం. 27-3-17/1, శ్రీనగర్, గాజువాక, విశాఖపట్నం-26.

D-2: గద్దె నాగతేజ, భర్త లేటు గద్దె వెంకటేశ్వరరావు, డో.నెం. 27-3-17/1, శ్రీనగర్, గాజువాక, విశాఖపట్నం-26.

D-3: గద్దె శిరీష్, D/o. లేటు గద్దె వెంకటేశ్వరరావు, డో.నెం. 27-3-17/1, శ్రీనగర్, గాజువాక, విశాఖపట్నం-26.

ఇందుమూలముగా పై ప్రతివాదులకు తెలియజేయునదేమనగా మీపై వాదిగారు తనకు రావలసియున్న బాకీ సొమ్ము రూ. 8,59,666/-లు రాబట్టుకొనే నిమిత్తం పై దావాను పై కోర్టునందు దాఖలు చేసి ఎన్ని పర్యాయములు సమన్లు/నోటీసులు జారీ చేసినను అవి ఏవియు మీరు అందుకోనందున శ్రీకోర్టు వారు మీకు ఈపేపర్ ప్రకటన ద్వారా సమన్లు/నోటీసులు జారీ నిమిత్తం ఆర్డరు వేసి కేసు వాయిదాను **తేది:05-09-2024కి** మీ హాజరు నిమిత్తం వేసియున్నారు. కావున మీరు పై తేదీన **ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరుఅయి మీకు ఎట్టి ఆక్షేపణలున్నను లిఖిత పూర్వకముగా తెలియపరచవలెను. లేనిచో మీకు ఎట్టి ఆక్షేపణలు లేవని భావించి మీ పరోక్షములో కేసు నిర్ణయించడును.

వాయిదా తేది: 05-09-2024

వి.శ్రీనివాసరావు

శ్రీమతి కె.శర్వాణి

న్యాయవాదులు, డో.నెం. 27-1-174/1 శ్రీనగర్, గాజువాక, విశాఖపట్నం-26.

సెల్: 9848447029.

గిట్టుబాటు లేక కూరగాయల రైతు బేజారు

ప్రజాశక్తి -తగరపువలస : ఎట్టకేలకు జివిఎంసి రెండో వార్డు పరిధి పాత మీ సేవా కేంద్రం సమీపంలో గత ప్రభుత్వ హయాంలో 1837.82 చదరపు గజాల విస్తీర్ణంలో మార్కెటింగ్ శాఖ నిధులు రూ.78 లక్షలతో 32 దుకాణాల సముదాయంతో రైతుబజార్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం సమయంలోనే మౌలిక సదుపాయాలు కల్పించి ఉంటే బాగుండేది. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపులో జాప్యంతో ఫ్లోరింగ్, తాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయం లాంటి కనీస వసతులు సమకూర్చలేదని జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ ప్రజాశక్తికి తెలిపారు. బిల్లు చెల్లింపు జరిగిన వెంటనే పనులు పున్ణ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో రైతు బజార్‌ను అప్పటి స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. కనీస సదుపాయాలు లేకుండానే దీన్ని ప్రారంభించడం పట్ల అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా దృష్టి పెట్టి త్వరిత గతిన మౌలిక సదుపాయాలు కల్పించి రైతుబజార్‌ను కూరగాయల రైతులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. రైతు బజార్‌లో నిర్మించిన 32 దుకాణాల్లో 27 డ్రా పద్ధతిలో కలెక్టర్ ఆధ్వర్యాన దుకాణాల కేటాయింపు జరగనుందని, మిగిలిన 5 కమర్షియల్ పద్ధతిలో కేటాయింపు ఉంటుందని షేక్ యాసిన్ తెలిపారు.

గిట్టు బాటు లేదు

ఆరుగాలం కష్టపడి పనిచేసి పండించిన కూరగాయలను అయిన కాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని పలువురు కూరగాయల రైతులు చెబుతున్నారు. భీమిలి, పద్మనాభం, భోగాపురం మండలాల్లోని పలు గ్రామాల రైతులు కూర గాయాలను ఆటోల్లో, ద్విచక్ర వాహనాలు, మినీ ట్రక్కుల్లో స్థానిక ప్రైవేట్ మార్కెట్‌కు ఉదయం 4 గంటలకే తెచ్చి అమ్ముతుంటారు. కొంత మంది దళారీలకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని కొందరు రైతులు వాపోతున్నారు. భీమిలి మండలంలోని మజ్జిపేట, నారాయణరాజు పేట, లక్ష్మీపురం, మజ్జివలస, తాటితూరు, దాకమర్రి, పద్మనాభం, భోగాపురం మండలాల్లోని పలు గ్రామాల రైతులు ఇక్కడి మార్కెట్‌కు కూరగాయలు అమ్ముకునేందుకు నిత్యం వస్తుంటారు.

అలంకారప్రాయంగానే రైతు బజార్
వసతులు సమకూర్చి వినియోగంలోకి తేవాలంటున్న రైతులు

అలంకార ప్రాయంగా ఉన్న రైతు బజార్

రైతుబజార్‌ను అందుబాటులోకి తేవాలి

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రైతు బజార్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలి. తద్వారా తాము పండించిన పంటలకు కాస్తా మెరుగైన ధర లభిస్తుంది. కూరగాయలతో పాటు ఇతర ఆహార పంటలు పండించడం ఇప్పుడున్న పరిస్థితులలో ఆర్థికంగా తలకు మించిన భారమే. అయినా తప్పదు.

కె నరసింగరావు
రైతు, దాకమర్రి
భీమిలి మండలం

ప్రభుత్వం ప్రోత్సాహమివ్వాలి

కూరగాయల పంటలు పండించేందుకు ప్రభుత్వం మరింతగా ప్రోత్సాహం ఇవ్వాలి. అందుకు అవసరమైన విత్తనాలు సబ్సిడీ ధరకు అందివ్వాలి. దళారీ వ్యవస్థ లేకుండా చేయాలి. దూరాభారం నుంచి ఆటోల్లో కూరగాయలు తెచ్చి అమ్ముతుంటే ఒక్కోసారి ఆటో చార్జీలు ఇచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నాం.

ఆర్.అప్పారావు
రైతు, జొన్నాడ
భోగాపురం మండలం

నేరాలు ఘోరాలు

గెడ్డలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ పోలీస్టేషన్ పరిధి పెదగదలి గెడ్డవద్ద గురువారం ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు ఆరిలోవ తోటగరువు ప్రాంతానికి చెందిన ముచ్చుకర్ల సోంబాబు (50)గా పోలీసులు గుర్తించారు. సోంబాబు గత కొంతకాలంగా పలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బుధవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం తెల్లవారు జామున పెదగదిలి గెడ్డ పక్కన మృతదేహం ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సోంబాబు మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి అక్కడే పడిపోయి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. మృతుడు సోంబాబుకు భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సాగరతీరంలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - ఆరిలోవ : సాగరతీరం జోడుగుళ్లపాలెం వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని గురువారం తెల్లవారు జామున స్థానికులు గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. సుమారు 50 ఏళ్ల వయసుగల వ్యక్తి మృతదేహం జోడుగుళ్లపాలెం బీచ్ ఒడ్డుకు కొట్టుకొచ్చింది. గురువారం ఉదయం సుమారు 10 గంటలకు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. మృతుని చేతికి కట్టు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మృతదేహానికి సంబంధించిన వివరాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కెజిహెచ్, మార్చురీలో భద్రపరిచినట్టు పోలీసులు తెలిపారు.

ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఖేలో ఇండియా సౌత్ జోన్ జూడో ఛాంపియన్ షిప్‌కు ఎంపిక

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలం శొంఠ్యాం శ్రీ వెంకట్ విద్య పీఠ్‌లో రాష్ట్ర జూడో క్రీడా సంఘం సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పాండ్రంకి రుఖ్మాకరరావు ఆధ్వర్యాన ఖేలో ఇండియా సౌత్ జోన్ జూడో చాంపియన్ షిప్ బాలికల ఎంపికలు నిర్వహించారు. ఈ సెలక్షన్‌లో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల సెప్టెంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు చెన్నైలో జరిగే సౌత్ ఇండియా జూడో చాంపియన్ షిప్‌లో పాల్గొంటారు. ఈ ఎంపిక కార్యక్రమంలో ఎలైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గండెం పోలారావు, విశాఖ జిల్లా టీమ్ మేనేజర్ గవర ఈశ్వరరావు, కోచ్ పోలిన ప్రవీణ్, శ్రీవెంకట్ విద్యాపీఠ్ చైర్మన్ రొంగలి వెంకటేశ్వరరావు పాల్గొని సౌత్ జోన్ జూడో చాంపియన్ షిప్‌నకు ఎంపికైన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

ఉదయ్ శంకర్‌కు సన్మానం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని లోడగలవానిపాలెం గ్రామానికి చెందిన మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి ఉదయ్‌శంకర్‌ను పాలవలస ఎంపిటిసి రౌతు శ్యామల వెంకట్రావు, రౌతు శ్రీను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉదయశంకర్ మాట్లాడుతూ, తన దృష్టికి ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలవలస గ్రామ టిడిపి ప్రెసిడెంట్ నిమ్మల అప్పలరాజు, నాయకులు సుంకరి బంగారు నాయుడు, చందక శంకర్రావు, కె.తమ్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్‌శంకర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం సబ్‌స్టేషన్ 11కెవి పెద్దిపాలెం, 11కెవి గంభీరం లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ కారణంగా దుక్కవానిపాలెం, ఈగలవానిపాలెం, పాలవలస మెట్టమీది పాలెం, తర్లువాడ, నగరంపాలెం, గుడిలోవ, పెద్దిపాలెం, పల్లిపేట, పొడుగుపాలెం, చందక, కుసులువాడ, జగన్నాధాపురం, గొట్టిపల్లి, వెంకటాపురం తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని, గృహ, పారిశ్రామిక వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు బకాయిలు చెల్లించాలని కాకాస అధ్యక్షులు జెవి.కైలాష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ జ్యూట్ యాజమాన్యాన్ని గురు వారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మారు పేర్లతో మిల్లులో పనిచేసిన వారికి ఇప్పటి వరకు పిఎఫ్, పింఛను అందలేదని పేర్కొన్నారు. సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గాలికుంటు నివారణకు టీకాలు

ప్రజాశక్తి -మధురవాడ : గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేయించాలని చంద్రంపాలెం పశువైద్యశాల వైద్యాధికారి ఆర్.అనుపమ కోరారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా వచ్చే నెల 18వ తేదీ వరకూ ఈ టీకాల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 4 నెలల వయసు దాటిన ప్రతి పశువుకూ తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. వీటి వల్ల వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చున్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్లపైనే వ్యాపారాలు
ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
పట్టించుకోని అధికారులు

మార్కెట్ ఏర్పాటుతో ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాహనాలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం కూడలిలో నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై వ్యాపారాలు సాగించడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్లే వాహనాలు, పెందుర్తి నుంచి విజయనగరం వెళ్లే వాహనాలు ఆనందపురం పూల మార్కెట్ నుంచి వచ్చే వాహనాలు, బిపికల్లాల నుంచి వేములవలస వచ్చే వాహనాలు పోవడానికి ప్రధాన రహదారి అయిన ఆనందపురం కూడలిలో రోడ్లపైనే పువ్వులు అమ్మకాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వాహనదారులు రోడ్లపైనే వాహనాలు ఆపి పువ్వులు తదితర వస్తువులను కొనుగోలు చేయడంతో మరింత ఇబ్బందికరంగా మారుతోంది. రోడ్లపైన వ్యాపారాలను నివారించే చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం 24 కాలనీకి చెందిన జైజవాన్ ఫౌండేషన్ సంస్థ దాతల నుంచి సేకరించిన రూ.14 వేలను బుధవారం ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి అందజేశారు. నెలరోజుల క్రితం విజయనగరం జిల్లా జొన్నాడ వద్ద పదిమంది గీత కార్మికులతో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడి ఇద్దరు చనిపోగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో దాకమర్రి గ్రామానికి చెందిన గొంప బంగారయ్య కోమాలోకి వెళ్లడంతో విజయనగరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించారు. రోజుకు రూ.20 వేలు ఖర్చవుతుందని హాస్పిటల్ యాజమాన్యం చెప్పడంతో నిరుపేద కుటుంబం కావడం వల్ల అంత భారం భరించలేక స్వచ్ఛంద సంస్థలను ఆశ్రయించారు. ఈ మేరకు ఆనందపురం గ్రామానికి చెందిన జై జవాన్ ఫౌండేషన్ టీమ్ దాతల సహాయంతో రూ.14 వేలు సేకరించారు. గొంప బంగారయ్య కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ నాలుగు రోజుల కిందట మృతిచెందాడు. సేకరించిన రూ.14 వేలును ఆ కుటుంబానికి ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, కోశాధికారి కుప్పరామలక్ష్మి, కుప్ప అప్పారావు, కుప్ప శ్రీను, చుక్క గణేష్, కుప్ప ఆనంద్ కార్తీక్, మెరుగు రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్

గాజువాకలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించాలి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో తక్షణం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించాలని జన విజ్ఞాన వేదిక విశాఖ జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.సత్యకుమార్ యాదవ్‌కు మెయిల్ ద్వారా వినతిపత్రం పంపారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి బుధవారం అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంపై చర్చించారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షులు ఎస్‌వికె.పరశురామ్ మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో అనేక ప్రమాదాలు జరిగాయని తెలిపారు. అచ్యుతాపురంలో జరిగిన ప్రమాదంలో సుమారు 17 మంది చనిపోయారని, గతంలో పరవాడ మండలంలో ఆల్కలి మెటల్స్, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ, కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలోని వసంత కెమికల్స్, నెల్లూరు జిల్లాలో మరో ప్రమాదం జరిగి చాలామంది మృతిచెందారని గుర్తుచేశారు.

ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను పరిశ్రమకు దూరంగా పట్టణాల్లో ఉన్న పెద్ద ఆసుపత్రులకు తరలించేలోపే మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దగ్గర్లో ట్రామా కేర్ యూనిట్స్ లేకపోవడం రసాయనక ఎక్స్‌పోజర్లు నిర్వహించడంలో శిక్షణ పొందిన వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల కూడా మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రత్యేక చికిత్స అవసరమైన రిఫరల్, రవాణా వ్యవస్థ అందుబాటులో ఉండడం లేదని పేర్కొన్నారు.

గౌరవాధ్యక్షులు డాక్టర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, నెల్లూరు శ్రీసిటీ వంటి పారిశ్రామిక ప్రాంతాలలో పరిశ్రమకు అందుబాటులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్యాక్టరీల యాజమాన్యాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు కె.శేషగిరిరావు, శ్రీకాంత్, ఎల్.కృష్ణారావు, కెవి.ప్రసాద్, పి లక్ష్మణస్వామి, ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన కోసూరి శ్రీనివాసరావు తదితరులు

జనసేన కార్యాలయానికి మంత్రి కందుల

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రిజం కాలేజీ వద్ద గల జనసేన విశాఖ నగర పార్టీ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. కందుల దుర్గేష్‌ను జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, జనసేన కార్యకర్తలు, అభిమానులు కలిసి పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. అనంతరం మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు, కార్యకర్తలకు తినిపించారు.

మంత్రి కందుల దుర్గేష్‌ను పార్టీ కార్యాలయంలో 35వ వార్డు జనసేన ఇన్‌ఛార్జి కోసూరి శ్రీనివాసరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు.

తగరపువలస : విశాఖ నగరంలో ఉన్న రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్‌ను స్థానిక జనసేన నాయకులు గురువారం కలిశారు. జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ ఆధ్వర్యాన పార్టీ ఒకటో వార్డు అధ్యక్షులు పరిమి భువనేశ్వరి, నాయకులు ప్రీతం, తమ్మిన అశోక్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. పలు ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

గ్రంథాలయాలు కీలకం

ప్రజాశక్తి-సీతమ్మధార : భూమిమీద అత్యంత ప్రధానమైనది గ్రంథాలయం అని ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. విశాఖ పౌర గ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి రావటం ఒక అలవాటుగా మారాలన్నారు. కొంతమంది ఉద్యోగం వచ్చేవరకే గ్రంథాలయానికి వచ్చి, తర్వాత మానేస్తూ ఉంటారని తెలిపారు. అలా కాకుండా ప్రతిరోజూ గ్రంథాలయానికి రావడం కోసం సమయాన్ని కేటాయించాలని సూచించారు. సిలబస్‌ను బట్టి టైం షెడ్యూల్‌ను పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయాన్ని చక్కగా తీర్చిదిద్దిన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, గ్రంథాలయం కార్యదర్శి డిఎస్‌వర్మ, వైస్ ప్రెసిడెంట్ టిఎస్ఆర్.ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

సమతానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ఉక్కునగరం : పెదగంట్యాడ పరిధి సమతానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. కాలనీ అధ్యక్షునిగా బొర్రా హనుమంతరావు, గౌరవాధ్యక్షునిగా వై.మన్మధరావు, కోశాధికారిగా మహమ్మద్ ఖాజా, షిరిడి సాయి శాంతిధామం ఆలయ ఛైర్మన్‌గా కొల్లి సత్యంబాబు, వైస్‌ఛైర్మన్‌గా బి.రవిశేఖర్ ఎన్నికయ్యారు. వీరిని కాలనీ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు తాగునీటికి అంతరాయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 7వ జోన్ అనకాపల్లి పరిధిలో అమృత్ 2.0లో భాగంగా తాగు నీటి సరఫరా మెరుగుపరిచేందుకు ఈ నెల 24వ తేదీన అనకాపల్లి జోన్‌లో తాగు నీటికి అంతరాయం కలుగుతుందని జివిఎంసి కార్యనిర్వాహక ఇంజినీరు శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మికుల పెన్షన్ జాయినింగ్ తేదీ సరిచేయాలి

గేటు ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : టి అండ్ ఆర్ సిరీస్ కార్మికుల పెన్షన్ జాయినింగ్ తేదీని సరిచేయాలని భెల్ విశాఖ యూనిట్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ డిమాండ్ చేశారు. సర్వీస్ పరిగణలోకి తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ ప్రోగెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యాన గురువారం భెల్ గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, క్యాజువల్ సర్వీస్ నుంచి పర్మినెంట్ అయిన టి అండ్ ఆర్ కార్మికుల పెన్షన్ చెల్లింపుపై యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. 1989, 1992 నుంచి డేట్ ఆఫ్ జాయినింగ్స్‌ను సరిచేయాలని కోరారు. యాజమాన్యం కావాలని ఈ విషయంలో ద్వంద్వ వైఖరి, అవలంబిస్తోందన్నారు. ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి వి.బాబూరావు మాట్లాడుతూ, గతంలో తాము గుర్తింపులో ఉన్నప్పుడు వారందరికీ ఒక పద్ధతిలో పెట్టామని తెలిపారు., తర్వాత గుర్తింపులోకి వచ్చిన యూనియన్ సంవత్సర కాలమైనా పట్టించుకోలేదన్నారు. దీనిపై యాజమాన్యం వెంటనే న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే పిఎఫ్ ఆఫీస్ ముందు కూడా ధర్నా చేయడానికి సిద్ధమని ప్రకటించారు. కార్యక్రమంలో భాగంగా మెయిన్ గేటు నుంచి ఎడిఎం బిల్డింగ్ వరకు ర్యాలీగా వెళ్లి పిఎఫ్ ట్రస్ట్ అధికారి వివన్ మహంతాకి వినతి పత్రం అందించారు. ఈ విషయాన్ని పిఎఫ్ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్తానని వివన్ మహంతా చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.రామునాయుడు, సీతన్‌నాయుడు, ఎస్.జగన్నాధరావు, వి.ఆనందరావు, చిట్టిబాబు, కె.విజయ్‌కుమార్, ఆర్.అప్పారావు పాల్గొన్నారు,

పగిలిన గోస్తనీ పైపులైన్

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని బోని గోస్తనీ నది నుంచి విశాఖకు వెళ్తున్న తాగునీటి పైప్ లైన్ గొట్టిపల్లి వద్ద పగిలి నీరు వృథాగా పోతోంది. ఈ పైపులైను రోడ్డు మధ్యలోనే ఉండడంతో ఎప్పటికప్పుడు పైపులైన్ పగిలి నీరు వృథా అవుతూనే ఉంది. ఈ రహదారిలో ప్రయాణించే వాహన చోదకులకు కూడా ఇబ్బందిగా మారింది.

ఆనందపురం- బోని గోస్తనీ రోడ్డు నిర్మాణ సమయంలో చాలా చోట్ల పైపులను పక్కకు మళ్లించినా గొట్టిపల్లి కూడలికి సమీపంలో తారు రోడ్డు మధ్యలో మాత్రం పైపు ఉండిపోయింది. అక్కడే ఉన్న ఓ పరిశ్రమ గొడౌన్‌కు ప్రతి రోజూ భారీ వాహనాల వస్తున్నాయి. దీంతో అక్కడ రోడ్డు కింద ఉన్న పైపులపై ఒత్తిడి పడి పగిలి పోతున్నాయని పలువురు చెబుతున్నారు. దీంతో నీరు బయటకు పొంగి పెద్ద గొయ్యి ఏర్పడి రోడ్డు కొట్టుకు పోయింది. రాక పోకలకు ఆటంకంగా మారింది. పైపులైన్‌లో నీరు కలుషితం అవుతోంది. పైపు లైన్లు పగిలిన సమయంలో జివిఎంసి సిబ్బంది వచ్చి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైన్లు లీకేజి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహన చోదకులు కోరుతున్నారు.

వృథాగా పోతున్న నీరు

వృథాగా పోతున్న నీరు

డిమోంటి కాలనీ -2 చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రస్తుతం కంటెంట్ ఉన్న చిత్రాలకు విశేష ఆదరణ లభిస్తోందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బిటిజి యూనివర్సల్, వైట్ నైట్స్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సారథ్యంలో బాబీ బాలచంద్రన్, విజయ్ సుబ్రహ్మణ్యం ఆర్పి రాజ్‌కుమార్ నిర్మాతలుగా, ఆర్.అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో నిర్మించిన డిమోంటి కాలనీ -2 ఈ నెల 23న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న సందర్భంగా చిత్ర ప్రచార కార్యక్రమాలలో భాగంగా చిత్ర యూనిట్ గురువారం సాయంత్రం మద్దిలపాలెం సిఎంఆర్ సెంటర్‌లో సందడి చేసింది. కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, హీరోయిన్ ప్రియా భవాని శంకర్, దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు, నిర్మాత బి.సురేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా విశాఖలో ఎన్నో చిత్రాలను నిర్మించారన్నారు. డిమోంటి కాలనీ- 2 పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. నిర్మాత బి.సురేష్‌రెడ్డి మాట్లాడుతూ, సినిమా థ్రిల్లింగ్‌ను తలపిస్తుందన్నారు. హీరోయిన్ ప్రియా భవాని శంకర్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో తాను నటించడం సంతోషకరంగా ఉందన్నారు. దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు మాట్లాడుతూ, కచ్చితంగా తెలుగు ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేసే సినిమా అన్నారు. అనంతరం ప్రముఖ కొరియోగ్రాఫర్ లక్స్ రాజశేఖర్ వేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఇసుక నిల్వల తనిఖీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యాన పలు ప్రాంతాల్లో ఇసుక నిల్వలపై తనిఖీలు నిర్వహించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ పి.వెంకటప్పలనాయుడు పర్యవేక్షణలో సీతమ్మధార, భానునగర్, మద్దిలపాలెం, తాటిచెట్లపాలెం, రామాటాకీస్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో ఇసుక నిల్వలను తనిఖీ చేశారు. అనుమానిత ప్రాంతాల్లో ఇసుక, ఇటుక, కాంక్రీట్ రాయి విక్రయిస్తున్న స్టాక్ పాయింట్లను కూడా తనిఖీలు చేశారు. ఎక్కడా అక్రమంగా ఇసుక నిల్వలు లభించలేదని ఇన్‌స్పెక్టర్ వెంకటప్పలనాయుడు మీడియాకు తెలిపారు.

భీమునిపట్నం : ఇసుక అక్రమ నిల్వలపై ప్రత్యేక నిఘా వేసినట్లు ఎస్ఇబి స్థానిక ఎస్ఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. గురువారం పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇసుక అక్రమ నిల్వలపై తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇసుకను అనధికారికంగా నిల్వ ఉంచినట్లు తమ దృష్టికి వస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కృష్ణాకాలనీలో ఇసుక డిపోను పరిశీలించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఈ విద్యా సంవత్సరం జిల్లాలో ఎంపిక చేసిన 100 పాఠశాలల్లో చేతులు పరిశుభ్రతపై నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంఇఒ కె.దివాకర్ తెలిపారు. విద్యార్థులు ఆటలు, మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తర్వాత, తినబోయే ముందు చేతులను శుభ్రపరచుకోవడం పట్ల అవగాహన పెంచే విధంగా కొన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఈ విషయాలను విద్యార్థులకు సమర్థవంతంగా అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన పిల్లలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలలో వరల్డ్ హ్యాండ్ వాష్ డే, వరల్డ్ టాయిలెట్ డే, మెన్సువల్ హైజీన్ డే సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జాతీయస్థాయిలో డెటాల్ హైజిన్ ఒలింపియాడ్ ఎగ్జామ్ జరుగుతుందని, ఆ పరీక్షలో విద్యార్థులందరూ పాల్గొనేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ కె.నాగేంద్రజోగి, డెటాల్ బనేగా ఇండియా ప్రతినిధులు ఎఎస్.కుమార్, ఎం.పుల్లన్న, గోడే ప్రసాద్ పాల్గొన్నారు.

జెన్‌పాక్ట్‌తో జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన జెన్‌పాక్ట్ కంపెనీతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఏదైనా బీటెక్ / డిగ్రీ 2022/ 23 /24 సంవత్సరాలలో ఉత్తీర్ణులైన జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువత డ్రైవ్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https://bit.ly/46Wzqz లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూ తేదీ వివరాలను మెయిల్ ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఎసెన్షియా ఫార్మా యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో

అచ్యుతాపురంలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఫార్మా కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని, ఎసెన్షియా యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో కంపెనీలతోపాటు సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. పరిశ్రమల్లో యాంత్రికపరమైన లోపాలపై నిరంతరం తనిఖీలు చేయాలన్నారు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడునాయుడు, మునగపాక మండల నాయకులు ఎస్ బ్రహ్మాజీ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ముఠా సంఘం నాయకులు ఆర్ సత్తిబాబు, సిహెచ్.శివాజీ, సి హెచ్. రామకృష్ణ కార్మికులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఆసుపత్రి వద్ద ధర్నా

అనకాపల్లి : ఎసెన్షియా ఫార్మా కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన 17 మంది కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, వారి కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన బాధిత బంధువులు గురువారం స్థానిక ఎన్‌టిఆర్ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబాలకు తక్షణమే పరిహారం చెల్లించకపోతే మృతదేహాలను తీసుకెళ్లమని, ఎన్ని రోజులైనా ఇక్కడే ఉంటామని హెచ్చరించారు. మార్చురీ దగ్గరికి ప్రజాప్రతినిధులు ఎవరు రాకపోవడం చాలా బాధాకరమన్నారు. ఎన్నికల పేరుతో ముడుపులు తీసుకుంటున్న ప్రజాప్రతినిధులు కంపెనీ యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కేవలం రూ.2లక్షలు ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, సిపిఎం మండలం కార్యదర్శి గంటా శ్రీరామ్, అల్లు రాజు, పి.చలపతి, మృతుల బంధువులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న సిపిఐ, ఏఐటియుసి నేతలు

అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు, సిఐటియు నేతలు

సమగ్ర దర్యాప్తు చేయాలని నిరసన

అనకాపల్లి : ఎసెన్షియా ఫార్మా పరిశ్రమ ప్రమాద సంఘటనను నిరసిస్తూ గురువారం సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ, ఏఐటియుసి జిల్లా కార్యదర్శులు బాలేపల్లి వెంకటరమణ, రాజాన దొరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎసెన్షియా ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి యాజమాన్యం పైన క్రిమినల్ కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. తరచూ ఇటువంటి సంఘటనలు జరగడానికి కారకులైన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ, ఏఐటియుసి నాయకులు అప్పలరాజు, దేవుడుబాబు, సత్యనారాయణ, పి.సత్యనారాయణ, కోన లక్ష్మణ్, బబ్జి, ఫణీంద్ర కుమార్, కన్నబాబు, వి.రాజు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సమస్యలు వివరిస్తున్న సిఐటియు నేత రాము

ముఖ్యమంత్రి దృష్టికి సెజ్ సమస్యలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎసెన్షియా ఫార్మాలోని ప్రమాద సంఘటనా స్థలాన్ని పరిశీలించడానికి గురువారం వచ్చిన సందర్భంగా ఎస్ఇజెడ్ పరిశ్రమల్లోని పలు సమస్యలను ఆయన దృష్టికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము తీసుకెళ్లారు. ఎస్ఇజెడ్ పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించి, అందులో వెలుగు చూసే లోపాలను బయటపెట్టి పరిష్కరించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. సెజ్ పరిశ్రమలలో వేలాదిమంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులను దూరప్రాంతాలకు తరలించాల్సి వస్తుందని, దీంతో మార్గమధ్యలోనే ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. పరిశ్రమలకు దగ్గర్లో హాస్పటల్ ఉంటే సకాలంలో వైద్య సేవలు అందుతాయని, అందువల్ల అచ్యుతాపురం కేంద్రంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేయాలని కోరారు. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడు నాయుడు, మండల కన్వీనర్ కె.సోమునాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, శివాజీ, రామకృష్ణ తదితరులున్నారు.

క్షతగాత్రులకు స్పీకర్, ఎంపీ, ఎమ్మెల్యేల పరామర్శ

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎసెన్షియా కంపెనీ ప్రమాద బాధితులను గురువారం ఎపి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్నీ బాలాజీ, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ ఉన్నారు.

క్షతగాత్రులను పరామర్శిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపీ రమేష్, ఇతర నాయకులు

ఎసెన్షియా పరిశ్రమను సందర్శించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రమాదం జరిగిన ఎసెన్షియా ఫార్మా పరిశ్రమను గురువారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎలమంచిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్‌బాబు తదితరులు సందర్శించారు. ప్రమాదానికి కారణమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. భద్రతా ప్రమాణాలు యాజమాన్యం పాటించాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. తరచూ ఆడిటింగ్ చేయడం వలన ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ఉన్నారు. బుధవారం రాత్రి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రమాద సంఘటన స్థలాన్ని సందర్శించి అధికారులతో సమీక్షించారు.

ఎమ్మెల్సీ, మాజీ మంత్రుల సందర్శన

ప్రమాద సంఘటనా స్థలాన్ని గురువారం సాయంత్రం విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు తదితరులు సందర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక వైసిపి నాయకులు లాలం రాంబాబు, కోన బుజ్జి, దేశం శెట్టిశంకర్రావు తదితరులున్నారు.

ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ బొత్స, మాజీ మంత్రులు

గోకులం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న గోకులం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గోకులం పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. రెండు పశువుల గోకులం యూనిట్ విలువ రూ.1,15,000 కాగా రైతు వాటా రూ.11,500 చెల్లించాలన్నారు. 4 పశువుల గోకులం యూనిట్ విలువ రూ.1,85,000 కాగా, రైతు వాటా 18,500, 6 పశువుల గోకులం యూనిట్ విలువ రూ.2,30,000 కాగా రైతు వాటా రూ.23,000 అని పేర్కొన్నారు. అలాగే 20 జీవాల షెడ్ యూనిట్ విలువ రూ.1,30,000 కాగా రైతు వాటా రూ.39,000, 50 జీవాల షెడ్ యూనిట్ విలువ రూ.2,30,000 కాగా రైతు వాటా రూ.69 వేలు అని చెప్పారు. 100 కోళ్ల షెడ్డు యూనిట్ విలువ రూ.87,000 కాగా రైతు వాటా రూ.26,100, 200 కోళ్ల షెడ్డు యూనిట్ విలువ రూ.1,32,000 రైతు వాటా రూ.39,600 చెల్లించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, వలస, డి నోటిఫైడ్ తెగలవారు, దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నవారు, మహిళా కుటుంబ యజమాని, అంగవైకల్య యజమాని కుటుంబాలు, భూ సంస్కరణ పీఎంఏవైజీ లబ్ధిదారులు, అటవీ హక్కుల చట్టం 2006 లబ్ధిదారులు, చిన్న, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అర్హులైన రైతులు తమ దరఖాస్తు, ఆధార్ కార్డు, జాబ్ కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంకు పాస్ బుక్‌లను సంబంధిత రైతు సేవా కేంద్రంలో అందించాల్సి ఉంటుందని డాక్టర్ ప్రసాదరావు తెలిపారు.

మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాదరావు

మరిడిమాంబను దర్శించుకున్న నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి

కొట్నివీధిలో వెలసిన మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, 84వ ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం వారిని దేవస్థాన కమిటీ ఛైర్మన్ కొట్ని పూర్ణచంద్రరావు, హరినాథ్ శాలువాతో సత్కరించి అమ్మవారి మెమెంటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇల్లపు శ్రీను, నగిరెడ్డి మధు, కోరుకొండ సంతోష్, గొర్లి రమణమ్మ, పార్టీ నాయకులు కొట్నీ రామకృష్ణ, కొట్ని దుర్గి నాయుడు, మామిడి రాధాకృష్ణ, గుర్రాల వాసు తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

స్కేటింగ్‌లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -కశింకోట

ఇటీవల యునైక్స్యు రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 8వ స్కేటింగ్ పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ విద్యార్థులు 7 బంగారు పతకలు, 8 వెండి, 6 కాస్య పతకాలు సాధించారు. వీరిని పాఠశాలలో గురువారం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపనంద, స్కేటింగ్ కోచ్ రవి కుమార్,అకాడిమిక్ ఇన్‌చార్జ్ చంద్రమౌళి, సహా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గ్రావెల్ అక్రమ దందా

గ్రామస్తుల ఫిర్యాదుతో జెసిబి, లారీల స్వాధీనం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని పెదగొల్లలపాలెం జగనన్న కాలనీ స్థలంలో ఉన్న గ్రావెల్‌ను రాత్రి వేళలో అక్రమంగా తరలించి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ఇలాగే బుధవారం రాత్రి గ్రావెల్ అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తుండగా కొంతమంది గ్రామస్తులు రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్వో శేషు పోలీసులు సహాయంతో గురువారం వేకుజామున సంఘటన స్థలానికి చేరుకొని రెండు లారీలను, ఒక జెసిబిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా విఆర్ఓ మాట్లాడుతూ పెదగొల్లలపాలెం సర్వే నెంబర్ 293లో జగనన్న కాలనీ స్థలంలో ఈ గ్రావెల్ దందా జరుగుతుందని తెలిపారు. సర్వేనెంబర్ 273 ప్రైవేటు లేఔట్‌లో కూడా ప్లాట్ల స్థలంలో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుతున్నారన్నారు. మరో రెండు లారీలు, ఒక జెసిబి స్థలం నుండి తప్పించుకొని వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈ గ్రావెల్ అక్రమ తరలింపుపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డిజైనింగ్‌కు సాంకేతికత అవసరం

ప్రజాశక్తి-అనకాపల్లి

జ్యువెలరీ డిజైనింగ్‌కు సాంకేతిక నైపుణ్యం అవసరమని జ్యువెలరీ డిజైనర్, వృత్తి నైపుణ్య శిక్షకులు జ్యోతి కొరారి (ముంబాయి) పేర్కొన్నారు. శ్రీగౌరీ గ్రంథాలయంలో గురువారం జ్యూవెలరీ డిజైనింగ్‌పై జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడుతూ జ్యూవెలరీ డిజైన్లు సృజనాత్మకత మీద ఆధారపడి ఉంటుందన్నారు. ఆభరణాల రూపకల్పన అనేది నగల రూపకల్పన సృష్టించే కళ లేదా వృత్తి అని పేర్కొన్నారు. డిజైనర్ ప్రతిభ, నైపుణ్యాలను బట్టి ఆదాయం సమకూరుతుందన్నారు. ఒక సాధారణ ఫ్రీలాన్స్ జ్యూవెలరీ డిజైనర్ నెలకు రూ.10 వేలు నుండి రూ.30 వేలు వరకు సంపాధించవచ్చని చెప్పారు. జ్యూవెలరీ డిజైనింగ్ అన్ని దేశాల్లో గొప్ప పరిధిని కలిగి ఉన్న వృత్తి అని పేర్కొన్నారు. జ్యూవెలరీ డిజైన్ అనేది ఫ్యాషన్, వినోద పరిశ్రమల విస్తరణతో అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ అని తెలిపారు. ఏదైనా ఆభరణాల వస్తువును తయారు చేసే ముందు, దానిని కాగితంపై గీయడం చాలా ముఖ్యమని, గులాబీ-గోల్డ్, డైమండ్ జ్యూవెలరీ డిజైనింగ్‌లో ఆభరణాల తయారీ తరగతులు సహాయపడతాయని చెప్పారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ ఔత్సాహకుల అభిరుచుల మేరకు గ్రంథాలయం ఆధ్వర్యంలో మరిన్ని వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. గౌరీ గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు కర్రి శివ, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు, వృత్తి నైపుణ్య శిక్షకులు రాపేటి ప్రేమలత, మళ్ల మౌనిక, గిలకంశెట్టి నాగమణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వృత్తి నైపుణ్య శిక్షకులు జ్యోతి కొరారి

మండల పరిషత్తు సమావేశంలో సమస్యలపై ఏకరువు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలను పరిష్కరించాలని ఏకరువు పెట్టారు. వ్యవసాయ శాఖ సమీక్షలో విత్తనాల సమయంలో విత్తనాల కొరత ఏర్పడినా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పుడైనా ఎరువుల కొరత లేకుండా చూడాలని వైస్ ఎంపిపి దొండా లలిత అన్నారు. ఫీల్డ్ సర్వే చేసి ఈ క్రాప్ నమోదు చేయాలని వ్యవసాయ అధికారి భాస్కర్‌ను కోరారు. కలుపుతీతకు అధిక భారం అవుతుందని, కలుపుతీత యంత్రాలు ఇస్తే రైతులకు మేలు జరుగుతుందని పోలేపల్లి సర్పంచ్ సీతా బుజ్జి అన్నారు. పోలేపల్లిలో వాటర్ ట్యాంకు నిర్మాణం తక్షణమే ప్రారంభించాలని కోరారు. పెండింగ్లో ఉన్న హౌసింగ్ బిల్లులను విడుదల చేయాలని ఏఈ రామచంద్రను పలువురు సభ్యులు కోరారు. చింతపాకలో విలేజ్ క్లినిక్ తాళాలు వేసి ఉండటం వల్ల తాము ఆ గ్రామంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించలేకపోతున్నామని వైద్యాధికారి సంధ్యారాణి అన్నారు. హెల్త్ విలేజ్ క్లినిక్ నిర్మాణ బిల్లులు విడుదల చేయకపోవడంతో బిల్డింగ్ ఇంకా అప్పగించలేదని సర్పంచ్ గొలజాన శ్రీను తెలిపారు. వడ్డాది, కొత్తూరు, విజయరామరాజుపేటలో జిజిఎం పనులు ప్రారంభించి తాగునీరు అందించాలని సర్పంచ్ ఎల్లపు విజయ్ కుమార్, వైస్ ఎంపిపి డి.లలిత కోరారు. కార్యక్రమంలో ఎంపిడీవో సువర్ణరాజు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఉపాధి హామీ ఏపీఓ మురళి, పలువురు సర్పంచులు, ఎంపిటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

టీ నీళ్లకు దిక్కులేదు..

ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరైనా వారికి టీ, బిస్కెట్లు కూడా ఇవ్వాలన్న కనీస మర్యాదలను మండల అధికారులు పాటించలేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు మండిపడ్డారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి సంధ్యారాణి

పశువుల ఆసుపత్రిలో డాక్టర్‌కు పాముకాటు

- శిథిలావస్థకు చేరిన భవనం
- కొత్త బిల్డింగ్ వినియోగంలోకి తేవాలని వేడుకోలు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తుండగా పశు వైద్యాధికారి డాక్టర్ వాసవిని పాము కాటు వేసింది. దీంతో ఆమెను హుటాహుటిన చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. కాగా పురాతనమైన శిథిల భవనం కావడంతో తుప్పలు డొంకలు పెరిగి ఆసుపత్రిలోకి పాములు ప్రవేశిస్తున్నాయి. దీంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వైద్యాధికారిని కాటు వేసిన పాము ఇప్పటికే ఆసుపత్రిలోనే ఉందని సిబ్బంది తెలిపారు. వర్షం పడితే ఆస్పత్రి భవనం అంతా కారిపోతుందని, పాముల సంచారం పెరిగిపోతుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే విశాఖ డెయిరీ నిధులతో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

కూలిపోయే స్థితిలో ఉన్న వడ్డాది పశు వైద్యశాల

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

లంకెలపాలెంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పరవాడ

మెగాస్టార్ చిరంజీవి 69వ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పరవాడ మండలం లంకెలపాలెంలో గత వారం రోజులుగా నిర్వహించిన చిరంజీవి జన్మదిన వారోత్సవాలు ముగింపు సందర్భంగా లంకెలపాలెం జంక్షన్‌లో గురువారం కేక్ కటింగ్ చేశారు. పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సోదరులు, పరవాడ మండల జనసేన పార్టీ ఇన్చార్జి ప్రసాద్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు జన్మదిన వేడుకలు నిర్వహించి వివిధ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, బిజెపి నాయకులు గొన్న రమాదేవి, కర్ణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్లు చినతల్లి నీలబాబు, వరలక్ష్మి ప్రసాద్, నాయకులు మోటూరు సన్యాసినాయుడు, ఆకుల అప్పలసూరి, గుంటూరు శంకర్రావు, పి నాగేశ్వరరావు, దుల్ల లక్ష్మీ రామునాయుడు, బలిరెడ్డి అప్పారావు, బొద్దపు రమణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సినీ పరిశ్రమలో ఎవరి సహకారం లేకుండా స్వశక్తితో ఎదిగిన వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి అని జనసేన సీనియర్ నాయకులు, కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. గురువారం 32వ వార్డులోని కార్యాలయంలో చిరంజీవి జన్మదిన వేడుకలను జనసేన నాయకులు, అభిమానుల సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో కందుల కృష్ణ, చిన్ని అప్పారావు, నాగేంద్రరావు, మంత్రి శాలివాహన్, వరలక్ష్మి, శ్రీదేవి, కుమారి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

భీమునిపట్నం : చిరంజీవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను చిరంజీవి అభిమానులు గంటా నూకరాజు, మైలపల్లి లక్ష్మణరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు వై.హరి, ఎం.నరసింగరావు, ఎస్.బాబూరావు, ఎ.శ్రీను, ఆర్.ప్రభాకర్‌నాయుడు, కె.కామేష్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా గంట స్తంభం వద్ద పులిహోర పంపిణీ చేశారు.

నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు.నక్కపల్లిలో చిరు అభిమానులు మీగడ సత్తిబాబు, లంక శ్రీనివాసరావు, కొల్నాటి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. స్థానిక బాలిక ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కోసూరి శ్రీను, నాగు దేవవరపు లోవరాజు, ముద్దా త్రినాధరావు, పెద్దిరెడ్డి రమేష్ పాల్గొన్నారు. ఉపమాకలో చిరు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు ప్రగడ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

భీమిలి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న నూకరాజు

రోగులకు పండ్లు ,రొట్టెలు అందజేస్తున్న చిరు అభిమానులు

కుర్చీల వద్ద ఉన్న చెత్తాచెదారం

చెత్తమయంగా బస్ స్టేషన్

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట ఆర్టీసి బస్ స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రతీ రోజూ ఇక్కడ చెత్త సేకరణ చేయక పోవడంతో కాంప్లెక్స్ ఆవరణలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. దీంతో, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తతో పాటు దుర్వాసన కూడా వెదజల్లుతుందని వాపో తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రతీ రోజూ చెత్త సేకరణ చేసి కాంప్లెక్స్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

-స్పీకర్ ఆదేశాలు బేఖాతర్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఖాకీలు, రెవెన్యూ అధికారుల పని తీరు మండలంలో అక్రమార్కులకు అండగా నిలుస్తుంది. గబ్బాడ, బలిఘట్టం ఇసుక ర్యాంపులో మాయమైన ఇసుక గురించి పలుసార్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు హెచ్చరించినప్పటికీ అటు ఖాకీలకు గాని రెవెన్యూ అధికారులు గానీ కనీసం పట్టించుకోలేదు. ఇసుక అక్రమార్కులను గుర్తించాలని అయ్యన్నపాత్రుడు చెప్పినప్పటికీ అధికారులలో మాత్రం కనీస స్పందన లేదు. ఇసుక అక్రమ దందాపై రెవెన్యూ అధికారులు పోలీసు అధికారులు స్పందించకపోవడం పట్ల స్థానిక ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. బలిఘట్టం వరాహ నది సమీపంలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుండటంతో విషయం తెలిసిన వెంటనే ఆర్డీవో హెచ్‌వి జయరాం స్పందిస్తూ పోలీస్ రెవెన్యూ మైనింగ్ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.

అయినా ఇసుక దందా అక్రమాలన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని స్థానిక ప్రజలు విమర్శించారు.పోలీసు, రెవిన్యూ, మైనింగ్ అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు గత నెలలో ఎంక్వైరీ వేయాలని తెలియజేసినప్పటికీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ కాలం వెళ్ళదీస్తున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు ఇసుక దోపిడీకి తెగబడుతున్నారు.

ఇది ఇలానే జరిగితే రానున్న రోజుల్లో సామాన్యులకు ఇసుక దొరికే పరిస్థితి లేదని మండలంలో ప్రజలు అంటున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే చెరువులు, సెలయేర్లు, గెడ్డలు, వాగులులలో ఇసుక మిగలకుండా కబ్జాలు చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెప్పినప్పటికీ సామాన్యులకు ఇసుక దొరకడం కష్టం గా మారి పోయింది. త్వరితగతిన విచారణ పూర్తి చేసి గబాడ ఇసుక ర్యాంపు వద్ద ఇసుక అమ్మకాలు కొనసాగించాలని భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు.

ఇసుక ర్యాంపు వద్ద ట్రాక్టర్ (ఫైల్ ఫొటో)

అక్రమ ఇసుక దోపిడిని అరికట్టాలి

అక్రమ ఇసుక దోపిడిని అరికట్టాలి. త్వరితగతిన గబ్బాడ ఇసుక ర్యాంపు వద్ద అమ్మకాల కొనసాగించినట్లయితే భవన నిర్మాణ కార్మికులకు పని కనిపించినట్లు అవుతుంది. ఇప్పటికే ఇసుక దొరకడం మండలంలో కష్టంగా మారిపోయింది. సామాన్యులకు సైతం ఉచిత ఇసుకను అందించాలి.

కే.రామకృష్ణ.

భవన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు

ఫోటో రైట్ అప్

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉపాధి హామీ పనుల గుర్తింపుపై వినతి

ప్రజాశక్తి - మాడుగుల : ఉపాధి హామీ పనులను గ్రామ సభలలో గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కార్లి భవాని, గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి కోరారు. ఎంపీడీవోకు గురువారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ సభల్లో కూలీలకు ఉపయోగపడే పనులు తక్కువగా ఉన్నాయని, మేటిరియల్ చార్జీల ద్వారా చేయవలసిన పనులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం సూచించిన పనుల్లో కొన్నింటిని మార్పులు చేయాలని, చెరువులు, లింక్ రోడ్లు, శ్మశానం వాటికలకు రోడ్లు వంటి వాటిని గుర్తించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులకు, సన్న చిన్నకారు రైతులకు పనులు కల్పించే ఉద్దేశ్యంతో ఆనాడు వామపక్షాల ఒత్తిడితో యుపిఏ 2 ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టం చేసిందన్నారు. బిజెపి ప్రభుత్వం కాల క్రమేణా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ వస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ కూలీలకు సంబందం లేని పనుల గుర్తింపునకు ప్రయత్నం చేస్తుందని, దీన్ని పున:పరిశీలన చేయాలని కోరారు.ప్రభుత్వం సూచించిన పనులు గుర్తింపులో మేటిరియల్ చార్జీల ద్వారా ఎక్కువగా చేయ వలసిన పనులు ఉన్నాయని తెలిపారు.

ఉపాధ్యాయున్ని నియమించాలని వినతి

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని వాలసీ పంచాయతీ పరిధి నిమ్మలపాడు ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడును నియమించాలని కోరుతూ స్థానిక జెడ్పిటిసి గంగరాజు ఆధ్వర్యన తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు గురువారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఏటిడబ్ల్యూ, ఎంఈఓలకు కలిసి లిఖితపూర్వకంగా విన్నవించారు. అనంతరం జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, నిమ్మలపాడు పాఠశాలలో గత మూడు నెలలుగా ఉపాధ్యాయుడు లేక నిమ్మలపాడు, కరకవలస, రాళ్లగెడ్డ, సప్పనగెడ్డ గ్రామాలకు చెందిన సుమారు 73 మంది విద్యార్థులు అక్షరాలు నేర్చుకోలేని పరిస్థితితో ఉన్నారన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయం వద్ద ఈనెల 23న శుక్రవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, గ్రామ సభలకు మండల స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు గ్రామ సభల ఉద్దేశాన్ని తెలుసుకుని వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు .

ఉపమాకలో హాజరు కానున్న హోంమంత్రి

నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీలో శుక్రవారం నిర్వహించనున్న గ్రామ సభలో హెూంమంత్రి వంగలపూడి అనిత, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ పాల్గొంటారని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోటవురట్ల: ఉపాధి గ్రామ సభలను విజయవంతం చేసేందుకు అధికారులు సన్నద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 25 గ్రామపంచాయతీలలో ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న గ్రామసభలో ఒక్కో గ్రామంలో రెండు గంటల పాటు నిర్వహించనున్నారు. ఇందుకోసం మండల స్థాయి అధికారుల సమక్షంలో గ్రామ సభలో జరిగే విధంగా చర్యలు చేపట్టారు. 38 రకాల వివిధ పనులపై దరఖాస్తులు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ప్రధానంగా రైతులకు ఉపయోగపడే కోళ్ల ఫారం, పశువుల షెడ్లు, గొర్రెల పెంపకం షెడ్లు, పండ్ల, పూల తోటలు పెంపకం, పంట కాలువల తవ్వకాలు, పట్టుపురుగుల షెడ్డు వంటి నిర్మాణాలకు రైతులు గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అర్హత కలిగిన వారు శుక్రవారం గ్రామ సభలో కార్యదర్శికి వినతి పత్రం అందజేయాల్సి ఉంటుంది.

బుచ్చయ్యపేట : ఉపాధి హామీ పనులపై బుచ్చయ్యపేట మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు శుక్రవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సువర్ణ రాజు తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన సీసీ రోడ్లు, డ్రైన్లు, చెక్ డ్యామ్‌లు, పశువుల షెడ్లు ఇలా అన్ని పనులపై ప్రతిపాదనలు చేయవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేటి గ్రామసభలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రభుత్వ ఆదేశాలతో గ్రామసభలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి ఏర్పాటు పూర్తి చేసినట్లు స్థానిక ఎంపీడీవో ఎస్ అప్పలరాజు తెలిపారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రజలు గ్రామసభల్లో తెలియజేయాలని కోరారు. 33 గ్రామ పంచాయతీలకు కార్యదర్శులతో పాటు మరో 20 మంది సూపర్వైజర్ అధికారులను నియమించినట్లు చెప్పారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి - మాడుగుల: మండలంలోని సత్యవరం గ్రామంలో జిల్లా పశు గణాభి వద్ధి సంస్థ అధ్వరంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం గురువారం నిర్వహించారు. పలు రకాల టీకాలను వేశామని ఎం. కోడూరు పశు వైద్యాధికారి అరుణ కిరణ్ తెలిపారు. 20 మంది పాడి రైతులకు మినరల్ మిక్చర్ పాకెట్లు, లివర్ టానిక్కులు పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు డివిజన్ ఉప సంచాలకులు సి. హెచ్. నరసింహులు, మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు, పశు వైద్యాధికార్లు గాయత్రి, మణి లక్ష్మణ్, సర్పంచ్ జెర్రి పోతుల నాగమణి, ఎం.పి.టి సి తలారి అప్పారావు పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న వైద్యులు

ప్రయివేటు పాఠశాలల సమయపాలనపై ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో ప్రైవేటు పాఠశాలలు సమయపాలన పాటించలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జీ.గీతాకృష్ణ కోరారు. గురువారం ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నంలో సుమారు 15కు పైగా ప్రైవేట్ పాఠశాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల సమయం వరకు సమయాన్ని పాటించకుండా పాఠశాలలను నడుపుతున్నాయన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ప్రైవేట్ పాఠశాలలు నడిపి విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. విద్యార్థులు రాత్రి 7:30 వరకు కాంప్లెక్స్‌లో ఉండి బస్సులు లేక అనేక ఇబ్బందులు పడుతూ తమ ప్రాంతాలకు వెళ్లడానికి కష్ట పడుతున్నారని చెప్పారు. సెలవు దినములలో పాఠశాలలు నడుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు దుర్గా, భార్గవ్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాటర్ బాటిల్స్ ఇస్తున్న నాయకులు

స్టీల్ వాటర్ బాటిళ్ల వితరణ

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని జగ్గంపేట ఎంపీపీ స్కూల్‌లో గ్రామ నాయకులు, నూతన స్కూల్ కమిటీ చైర్మన్‌లు విద్యార్థులకు స్టీల్ బాటిళ్లను వితరణగా అందజేశారు. జె.నాయుడుపాలెం హైస్కూల్ హెచ్ఎం డి.రమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ స్కూల్ నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపిపి పాఠశాలలో చేరారని తెలిసి పాఠశాల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎ.దేవి, గ్రామ నాయకులు శివాజీ, బాలరాజు, గోపి, కళ్యాణ్, పైడి నాయుడు, రమణ, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని సీతంపాలెం గ్రామానికి చెందిన అల్లు సింహాద్రి(38), గొర్ల బాబూజీ కలిసి బైక్ పై ఈనెల 20వ తేదీన నక్కపల్లి వస్తుండగా సబ్ రిజిస్టర్ కార్యాలయం సమీపంలో కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ఇద్దరిని విశాఖ ఆసుపత్రికి తరలించగా అల్లు సింహాద్రి బుధవారం రాత్రి మృతి చెందాడని, బాబుజి చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు .

మున్సిపల్ కమిషనర్ రవిబాబు బదిలీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక మున్సిపల్ కమిషనర్ రవిబాబు అయ్యారు. ఆయనను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో విశాఖపట్నం జివీఎంసిలో సూపరింటెం డెంట్‌గా పని చేస్తున్న సురేంద్రను నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా నియ మించారు. సురేంద్ర గతంలో నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన అనుభవం ఉంది.

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వరి పంట సాగుపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తకోట:కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్ర, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావికమతం మండలం మత్సవానిపాలెం గ్రామంలో వరి పంట పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రాజు కుమార్ మాట్లాడుతూ, వరి పంట మెదటి దశ లో 50 కేజీల డిఎపి, 20కేజీల యూరియా, 15 కేజీల పోటాషియం ఎరువులు వేసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ సమాచారం కొరకు రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 419 8800 ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సత్తిబాబు, ల్యాబ్ టెక్నిషియన్ స్రవంతి, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న బృందం ప్రతినిధులు

అతిసారపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రూరల్ వాటర్ సప్లై, శానిటేషన్, జల్ జీవన్ మిషన్, డీపీఎంయు బృందంచే అతిసార వ్యాధిపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ మాట్లాడుతూ, అపరిశుభ్రమైన ఆహారం భుజించడంతో అతిసార వ్యాధి వ్యాపిస్తుందని వివరించారు. ఈ వ్యాధి బారిన పడకుండా భోజనంకు ముందు తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.

జేజేయం జిల్లా కోఆర్డినేటర్ పి.పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంక్ లను శుభ్రం చేసి, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, డిపియం రాజేష్, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, బాలాజీ, సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి మీ కోసం ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు : ఈనెల 23 వ తేదీ నుండి ఐటీడీఏ సమావేశం మందిరంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకుని ఫిర్యాదుల సమర్పించాలని సూచించారు. ప్రజల సమస్యలను త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు.

హత్యాచార ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

భీమునిపట్నం : డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ భీమిలిలో విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, మానవ హక్కుల న్యాయ సేవా మండలి ప్రతినిధి సుధాకర్, రాజ్‌కుమార్, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

ఉక్కునగరం : అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, వైద్య విద్యార్థినిపై జరిగిన దారుణ సంఘటనలు మరోసారి దేశంలో ఎక్కడా పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టటానికి కొత్త చట్టాలను రూపొందించి, వారి రక్షణకు మరింత భద్రతను పెంచాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళలు విమల, సుశీల, పుష్య, కృష్ణవేణి, ఉష, అనంత, సుమ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : కలకత్తాలోని మెడికల్ విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా గురువారం సిఐటియు మునగపాక మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్ బ్రహ్మాజీ, పార్వతీ మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. చదువుకుంటున్న అమ్మాయిలు దగ్గర నుంచి ఉద్యోగాలు చేసే మహిళల వరకు అందరూ తీవ్ర వేధింపులు, అత్యాచారాలు, హత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అశ్లీల సాహిత్యం, నీలి చిత్రాలు వీడియోలతో యువత చెడుమార్గం పడుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఆశ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఏ వరలక్ష్మి, కుమారి, జయ, పద్మ, అంగన్వాడీలు ఉమా, హేమ, శివ లక్ష్మి పాల్గొన్నారు.

ఉక్కునగరంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

అద్దె బకాయిలు చెల్లించాలి

ధర్నాలో భవన యజమాని

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:బోయపాలెం ఎస్ఆర్ కాలేజీ యాజమాన్యం తమకు ఇవ్వవలసిన అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని భవన యజమాని బాదం వెంకట కృష్ణ సత్యనారాయణ కోరారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గురువారం చేపట్టిన ధర్నాలో అయన మాట్లాడుతూ, రోహిణి ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వహిస్తున్న ఎస్ఆర్ కాలేజీ యాజమాన్యానికి 20 ఏళ్ల అగ్రిమెంట్‌తో తమ భవనాన్ని అద్దెకు ఇచ్చామని, కొంతకాలం సక్రమంగా అద్దె చెల్లించారని తరువాత ఏవేవో సాకులు చెప్పి గత 31 నెలలుగా అద్దె చెల్లించకుండా తమను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పలుమార్లు కాలేజ్ ఎదుట తమ నిరసన తెలిపామని, అయినా యాజమాన్యం నుంచి స్పందన లేదని వాపోయారు.సుమారు రూ.3 కోట్ల వరకు అద్దె బకాయిలు చెల్లించాలని తెలిపారు.భవన నిర్మాణం కోసం తాను పలువురి వద్ద వడ్డీలకు అప్పు చేసానని కాలేజ్ యాజమాన్యం తమకు అద్దె చెల్లించకపోవడంతో మానసికంగా, ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదురుకొంటున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. భవన నిర్మాణం కోసం బ్యాంకులో రుణం తీసుకున్నామని, పలువురి వద్ద నిర్మాణ సామాగ్రి అరువు పద్ధతిలో తెచ్చామన్నారు. వెంటనే సదరు యాజమాన్యం తమ బకాయిలు చెల్లించి తమను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ సహ యజమాని బి.విజయ మాధవి, వెంకట శర్మ, అజయ్, దళిత సంఘం నాయకుడు కింతాడ అప్పలరాజు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: గంజాయి సాగు, రవాణాతో తలెత్తే అనర్థాలపై యువత, వాహనదారులకు మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం స్థానిక ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. గంజాయి రవాణా చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. వారపు సంతలో క్రమబద్ధంగా వాహనాలను నిలుపుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఎదుర్కొం టున్నారని సూచించారు. ఈ సమా వేశంలో బొలెరో, ఆటో యూనియన్, సర్పంచ్ లు, మండల సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లిలో భారీ వర్షం

పాక్షికంగా కూలిన పురాతన మేడ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్న సమయంలో కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ వర్షం వరికి ఊపిరినిస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో గురువారం కురిసిన వర్షానికి పురాతన మేడ పక్కనే ఉన్న పెంకుటిల్లుపై పాక్షికంగా కూలింది. మేడను ఆనుకుని పెంకుటింట్లో నివాసం ఉంటున్న వారు మేడ కూలిన శబ్దానికి భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. గ్రామంలో వెలగా సుబ్రహ్మణ్యంనకు చెందిన పురాతన మేడ శిథిలావస్థకు చేరింది. ఇంటి యజమానులు ఉద్యోగాల రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతానికి ఆ ఇంటిలో ఎవరు నివసించడం లేదు. భవనం శిథిలావస్థకు చేరడంతో కూలిపోయే ప్రమాదం ఉందని పక్కనే నివాసం ఉంటున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తూ భవనం యజమానులకు పలు పర్యాయాలు మొరపెట్టుకున్నారు. మేడ పాక్షికంగా కూలడంతో పెద్ద ప్రమాదం తప్పిందని లేదంటే తమ ప్రాణాలకే ముప్పు వాటిల్లేదని పొరుగున నివాసం ఉంటున్న వారు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పాక్షికంగా దెబ్బతిన్న మేడ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కందుల, రామ్

మన్యం ధీరుడు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:బాహుబలి, మగధీర స్థాయిలో లో మన్యం ధీరుడు చిత్రం కూడా ఘన విజయం సాధిస్తుందని.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. మన్యం ధీరుడు చిత్ర పోస్టర్ను గురువారం హెూటల్ నోవాటెల్లో రాష్ట్ర పర్యాటక సంస్కృతి, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌తో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ.. తన మిత్రుడు విశాఖ నగరానికి చెందిన ఆర్.వి.వి.సత్యనారాయణ నిర్మించిన చిత్రం అల్లూరి సీతారామరాజు చరిత్రను ప్రతిభందిస్తుందన్నారు. మంచి చిత్రాలకి ఆదరణ ఎప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి సినిమాలు ప్రోత్సహించి, రాయితీలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ను రామ్ కోరారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఇలాంటి సినిమాలు తప్పకుండా ప్రోత్సహిస్తామని సినిమా ట్రైలర్ చాలా అద్భుతంగా ఉందని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో మన్యం ధీరుడు నిర్మాత , హీరో ఆర్.వి.వి.సత్యనారాయణ, జనసేన డాక్టర్ సెల్ చైర్మన్ బొడ్డేపల్లి రఘు, తెలుగు శక్తి యువత అభివృద్ధి సలహాదారు వి.వంశీ బాబు తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో ప్రత్యామ్నాయ వైద్య సేవలు

సూపరింటెండెంట్ శివానంద

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల సమ్మె జరుగుతున్న నేపథ్యంలో విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రిలో ఓపి, ఐసి అత్యవసర సేవలు నిలిచి పోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మీడియాకు తెలిపారు. జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురైనప్పటికీ, గురువారం కెజిహెచ్‌లో 1622 మందికి ఓపి రోగులు, 99 ఐపి రోగులు అడ్మిషన్ను, 21 ఎమర్జెన్సీ చికిత్సలు, 20 మందికి ఎలక్టివ్ చికిత్సలు చేశామన్నారు. అత్యవసర సేవల కోసం సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు ఇక్కడ ఉన్న క్యాజువాలిటీకు, ఎమర్జెన్సీ సర్వీసుల్లో రోగులకు ఎటువంటి అంతరాయం లేని వైద్య చికిత్స కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.